'మహాలక్ష్మి'తో 3.80 కోట్ల మహిళలకు లబ్ధి

సంగారెడ్డి, జూలై 29: అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టి 3.80 కోట్ల మంది మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించిందని మెదక్ రీజినల్ మేనేజర్ ప్రభులత సోమవారం ప్రకటనలో తెలిపారు. రోజూ రీజియన్ పరిధిలో 1.70 లక్షల మంది మహిళలు ప్రయాణం చేస్తూ ఉచిత బస్సు సౌకర్యం పొందుతున్నారని పేర్కొన్నారు. ప్రయాణికుల రద్దీని బట్టి ప్రభుత్వం మెదక్ రీజియన్‌కు 87 కొత్త బస్సులను అందజేసిందన్నారు. ఇందులో 10 డీలక్స్ బస్సు లు, 35 పల్లె వెలుగు బస్సులు, 42 ఎక్స్‌ప్రెస్ బస్సులు ఉన్నాయని తెలిపారు. వాటిని డిపోల వారీగా పంపిణీ చేసి ప్రయాణికుల సౌకర్యార్థం నడిపిస్తామన్నారు. మహాలక్ష్మి పథకం ప్రవేశానికి ముందు 70 శాతం ఆక్యుపెన్సీ రేషియో ఉండగా, ప్రస్తుతం 98 శాతానికి పెరిగిందని పేర్కొన్నారు. గతంలో రోజుకు సుమారు 1.80లక్షల మంది ప్రయాణిస్తుండగా ప్రస్తుతం 2.60 లక్షల మంది ఆర్టీసీ సేవలు వినియోగించుకుంటున్నారని వివరించారు. త్వరలో ఆర్టీసీ సంస్థలో ఉద్యోగాల భర్తీ ప్రక్రియ కూడా మొదలవుతుందని తెలిపారు.

అసంపూర్తి పనులతో అవస్థలు

- సదాశివపేటలో నిలిచిన వెజ్ నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణం
- రోడ్లపైన సంతతో కొనుగోలుదారులు, విక్రయదారులకు తప్పని తిప్పలు
- మార్కెట్ కోసం రూ. 5.50 కోట్లు కేటాయించిన బీఆర్ఎస్ సర్కార్
- ప్రభుత్వం పట్టించుకోవాలని ప్రజల విజ్ఞప్తి

సదాశివపేట, జూలై 29 : ఇరుకు రోడ్లపైనే సంత, ఒకవైపు వాహనాల రాకపోకలు..మరోవైపు ఇరుకుగా ఉన్న రహదారిపైనే కూరగాయల విక్రయాలు...దీంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను తొలిగించేందుకు మార్కెట్‌ను నిర్మించేందుకు నిధులు కేటాయించినప్పటికీ పనులు మాత్రం అర్ధాంతరంగా నిలిచిపోయాయి. దీంతో వర్షం, దుమ్ము, ధూళిలోనే కూరగాయలు మాసం విక్రయాలు రోడ్లపైనే నిర్వహిస్తున్నారు. సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలోని దుర్గమ్మ గుడి వద్ద బైపాస్ రహదారిపై బుధవారం మార్కెట్ కొనసాగుతున్నది. గాంధీచౌక్ నుంచి గురునగర్ కాలనీ వెళ్లే రోడ్డుపై ఆదివారం మార్కెట్ కొనసాగుతున్నది. మార్కెట్‌కు సొంత స్థలం లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులు తొలిగించేందుకు కేసీఆర్ ప్రభుత్వం మార్కెట్ యార్డులో స్థలాన్ని కేటాయించింది. ఈ స్థలంలో కూరగాయలతో పాటు మాంసాహార విక్రయాలను వ్యాపారులు నిర్వహించేందుకు భవనానికి శంకుస్థాపన చేశారు. కానీ, పనులు పురోగతి కరువైంది. ఏండ్లుగా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నచందంగా మారింది.

మార్కెట్‌కు రూ.5.50 కోట్లు

సదాశివపేట జనాభాకు సరిపడా కూరగాయలు, మాంసాహార మార్కెట్ లేకపోవడం తో శాశ్వత పరిష్కారం కోసం మార్కెట్ యార్డులో వెజ్, నాన్‌వెజ్ మార్కెట్‌ను రూ.5.50 కోట్లతో నిర్మించాలని బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ భవనానికి 2021 జూన్ 7న అప్పటి ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, అప్పటి చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్, ప్రస్తుత ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ శంకుస్థాపన చేశారు. ఇందులో కూరగాయలు, చికెన్, మటన్, చేపలను విక్రయించేందుకు ప్లాట్‌ఫామ్‌లను నిర్మించేలా డిజైన్ చేశారు. ఏమైందో ఏమో తెలియదు కానీ, కూరగాయలు, మాంసాహార మార్కెట్ నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 5.50 కోట్ల నిధులు విడుదల చేసింది. కూరగాయలు, మాంసం, చేపలు అన్నీ ఒకే చోట లభించేలా అధికారులు మార్కెట్ నిర్మాణానికి డిజైన్ చేశారు. మార్కెట్‌కు వచ్చే ప్రజల కోసం పార్కింగ్ జోన్, మరుగుదొడ్లు, నీటి వసతి కల్పించడం, కూరగాయలు తీసుకొచ్చే వాహనాలకు లోడింగ్, అన్‌లోడింగ్ చేసుకునే సౌకర్యం కల్పించేలా మార్కెట్ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇప్పటికే మార్కెట్ అందుబాటులోకి రావాల్సి ఉంది. కానీ,శ్లాబ్ దశలోనే అర్ధాంతరంగా పనులు నిలిచిపోయాయి. దీంతో మార్కెట్ ప్రాంగణంలో పిచ్చిమొక్కలు దర్శనమిస్తున్నాయి. మార్కెట్ నిర్మాణం త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

సదాశివపేటలో అసంపూర్తిగా నిలిచిపోయిన వెజ్ నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణం

తొందరగా మార్కెట్ కట్టాలే...

రోడ్ల మీద అమ్ముకోవాలంటే మస్తు ఇబ్బందిగా ఉంది. వర్షం పడితే కుసోరాదు, అమ్ముకోరాదు. ఈడ మార్కెట్ నిర్మాణం సురువు చేసిండ్రు. కానీ, పని సరిగ్గా చేస్తలేరు. తొందరగా మార్కెట్ కడితే అందరికీ మంచిగుంటది. సార్లు జల్దీ పనులు చేయించి కూరగాయలు అమ్ముకునేటోళ్ల బాధలు పోగొట్టాలే.

– వసంత, కూరగాయల విక్రయదారు, సదాశివపేట

నేడు రెండో విడత పంట రుణమాఫీ

కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, జూలై 29: రెండో విడత పంట రుణమాఫీ మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీ ప్రాంగణం నుంచి విడుదల చేస్తారని కలెక్టర్ వల్లూరు క్రాంతి సోమవారం ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లో జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, రైతులు, అధికారుల సమక్షంలో రెండో విడత రుణమాఫీపై కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి రైతులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, సహకార శాఖ సిబ్బంది, బ్యాంకు సిబ్బంది పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఏపీ సీఎంను కలిసిన గంగా జోగినాథ్

అందోల్, జూలై 29: ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడును జోగిపేట ఏఎంసీ మాజీ చైర్మన్, జోగిపేట రైల్వేలైన్ సాధన సమితి కన్వీనర్ గంగాజోగినాథ్ సోమవారం ఢిల్లీలో మార్యాదపూర్వకంగా కలిశారు. ఢిల్లీలో చంద్రబాబు బస చేసిన హోటల్ వద్ద జోగినాథ్ కనిపించడంతో ఏరా జోగి బాగున్నావా.. అంటూ చంద్రబాబు ఆప్యాయంగా పలకరించి దగ్గరకు తీసుకున్నారు. ఎక్కడికి వచ్చావు.. ఏం పని అంటూ ఆరాతీసినట్లు జోగినాథ్ తెలిపారు. జోగిపేట రైల్వేలైన్ కోసం కేంద్ర మంత్రులను కలిసేందుకు వచ్చానని చెప్పి అందుకు మీ సహకారం కూడా కావాలంటూ కోరగా సీఎం అందుకు సానుకూలంగా స్పదిచారన్నారు. అనంతరం ఏపీ సీఎంగా చంద్రబాబు రెండోసారి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. రైల్వేలైన్ సాధనకోసం కొద్ది రోజులుగా గంగాజోగినాథ్ ఆధ్వర్యంలో జోగిపేటకు చెందిన పలువురు నాయకులు ఢిల్లీలోనే మకాంవేసి ఎంపీలు, మంత్రులను కలుస్తూ రైల్వేలైన్ సాధన కోసం కృషిచేస్తున్నారు.

విద్యకు అధిక నిధులు కేటాయించాలి

అమరవీరుల స్థూపం వద్ద నిరసన తెలుపుతున్న సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ నాయకులు

సంగారెడ్డి, జూలై 29: ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యా రంగానికి అరకొర నిధులు కేటాయించి చేతులు దులుపుకొందని, విద్యకు అధిక నిధులు కేటాయించి విద్యా వ్యవస్థను పటిష్టం చేయాలని డిమాండ్ చేస్తూ సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ నాయకులు నిరసన వ్యక్త ంచేశారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ అతిథిగృహం ఎదుట గల అమరవీరుల స్థూపం వద్ద నిరసన చేపట్టి విద్యా రంగానికి అధిక నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు అశోక్‌కుమార్, రాంచందర్, సంజీవయ్య, లక్ష్మయ్య యాదవ్, సోమశేఖర్, భాస్కర్, జగన్నాథం, అశోక్‌కుమార్, నాసర్ పటేల్, విజయ్‌భాస్కర్, సాయిలుచారీ, సిద్ధేశ్వర్, నర్సింలు, నాగేశ్వర్, నర్సింలు, సురేశ్, సందీప్, మొహినొద్దీన్, శ్రీధర్ మహేంద్ర, శ్రీకాంత్, దుర్గాప్రసాద్, రాధ, వీరమణి, రాములు ఉన్నారు.

అయ్యమ్మ చెరువులో చెత్తను తొలిగిస్తున్న పంచాయతీ సిబ్బంది

అయ్యమ్మ చెరువులో చెత్త తొలిగింపు

జిన్నారం, జూలై 29: గడ్డపోతారం అయ్యమ్మ చెరువులో చెత్తను డంప్ చేస్తుండడంపై ఈనెల 28న 'అయ్యమ్మ చెరువులో చెత్త డంపింగ్' శీర్షికతో నమస్తే తెలంగాణలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి వెంకట్ చెరువులో భారీగా పేరుకున్న చెత్త దిబ్బను జేసీబీ, ట్రాక్టర్ల ద్వారా డంప్‌యార్డుకు తరలించి ఆ ప్రాంతాన్ని శుభ్రం చేశారు. అయ్యమ్మ చెరువులో వేసిన చెత్తను తొలిగించడంపై మత్స్యకారులు, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మించాలి

సంగారెడ్డి, జూలై 29: ఏండ్ల క్రితం నిర్మించిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైపులు లీకేజీలతో రోడ్డుపై మురుగునీరు వరదలా పారుతూ కంపుకొడుతున్నదని, డ్రైనేజీతోపాటు సీసీ రోడ్లు నిర్మించాలని అధికారులను రాజీవ్ గృహకల్ప కాలనీ వాసులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని 33వ వార్డు రెవెన్యూ కాలనీ సమీపంలోని రాజీవ్ గృహకల్ప కాలనీలో డ్రైనేజీ నీళ్లు రోడ్డుపై పారుతున్నా పట్టించుకునే వారే లేరని ప్రశ్నించారు. ఈ సమస్యను ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి అధ్యక్షుడు శ్రీధర్ మహేంద్ర దృష్టికి తీసుకెళ్లారు. కాలనీ వాసులకు సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి సహా కార్యదర్శి శ్రీకాంత్, కాలనీ వాసులు అంజి, జనార్దన్, రాజుబాయి, నిర్మల, భవాని, స్వప్న, లత, తహేరా, బిస్మిల్లా ఉన్నారు.

డ్రైనేజీ నీటిని పరిశీలిస్తున్న ఫోరమ్ ఫర్ బెటర్ నాయకులు, మహిళలు

పనుల్లో నాణ్యతా లోపాన్ని సహించం

అమీన్‌పూర్, జూలై 29: నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి ఎక్కడా లోపాలు లేకుండా చూడాలని దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇంజినీరింగ్ విభాగం డీఈఈ ఓంప్రకాశ్, ఏఈ రమేశ్ అన్నారు. సోమవారం అమీన్‌పూర్ బీరంగూడ భ్రమరాంబిక ఆలయ ప్రహరీ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ మల్లికార్జున స్వామి ఆలయ స్థలం చుట్టూ ప్రహరీ నిర్మాణానికి రూ.1.3 కోట్లు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. దాదాపు 60 శాతం పనులు పూర్తయ్యాయని చెప్పారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆలయ ఈవో పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఆయన వెంట ఆలయ చైర్మన్ సధాకర్ యాదవ్, ఈవో శశీధర్ ఉన్నారు.

మొక్కల పెంపకంపై దృష్టి పెట్టాలి

మొక్కలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్, కమిషనర్, కౌన్సిలర్

అందోల్, జూలై 29: మొక్కల పెంపకంపై ప్రతి ఒక్కరూ దృష్టి పెట్టాలని అందోల్–జోగిపేట మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, కమిషనర్ తిరుపతి అన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా సోమవారం మున్సిపల్ పరిధిలోని 17వార్డులో కౌన్సిలర్ సత్యనారాయణతో కలిసి మహిళలకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో పచ్చదనం పెంపొందించాలనే లక్ష్యంతో ప్రతి ఇంటికీ మొక్కలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అందరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినయ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

హాస్టల్ సమస్యలు పట్టించుకోరా?

విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సంగారెడ్డి, జూలై 29: జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో బీసీ బాలికల వసతి గృహానికి నూతన భవనం నిర్మించాలని, అందుబాటులో ఉండని హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎర్రోళ్ల మహేశ్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని బీసీ బాలికల వసతిగృహాన్ని సందర్శించి విద్యార్థులకు సరఫరా చేస్తున్న వాటర్ ఫిల్టర్, వసతి గదుల్లో పేరుకుపోయిన చెత్తను పరిశీలించారు. అనంతరం మహేశ్ మాట్లాడుతూ విద్యార్థినులకు నాణ్యమైన భోజనం పెట్టడంలేదని, గుడ్లు, అరటి పండ్లు ఇవ్వడం లేదని ఆరోపించారు. తక్షణమే వార్డెన్ భాగ్యవతిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు కనీసం మంచినీటి సౌకర్యం కూడా లేదని, విద్యార్థులే బాటిళ్లలో తెచ్చుకొని తాగుతున్నారన్నారు. న్యూస్ పేపర్ రావడంలేదని, ఆర్ఓ వాటర్ ప్లాంట్ కూడా పని చేయడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. నాయకులు కార్తీక్, స్వప్న, శిరీష, సంధ్య, సింధు పాల్గొన్నారు.

వీరభద్రస్వామికి జడ్జి ప్రత్యేక పూజలు



గుమ్మడిదల: పూజలు చేస్తున్న జిల్లా జడ్జి భవానీచంద్ర

గుమ్మడిదల, జూలై 29: ప్రసిద్ధ శైవ క్షేత్రమైన బొంతపల్లి భద్రకాళీ సమేత వీరభద్రస్వామి సన్నిధిలో జడ్జి ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం మండలంలోని వీరన్నగూడెంలోని బొంతపల్లి వీరభద్రస్వామి సన్నిధిలో జిల్లా జడ్జి భవానీచంద్ర దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి అభిషేకాలు, అమ్మవారి వద్ద కుంకుమార్చనలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు ఆశీర్వచనలు ఇచ్చారు. అనంతరం ఆలయ ధర్మాదాయ శాఖ జూనియర్ అసిస్టెంట్ సోమయ్య ఆలయ మర్యాదలతో వారిని శాలువాతో సత్కరించారు. ఎస్సై మహేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

ఆదినారాయణస్వామి సన్నిధిలో..

జిన్నారం, జూలై 29: జిల్లాలో ప్రసిద్ధ క్షేత్రమైన ఆదినారాయణ స్వామి ఆలయాన్ని జిల్లా జడ్జి భవానీచంద్ర సందర్శించారు. భూదేవి, శ్రీదేవి సమేత ఆదినారాయణ స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా జడ్జికి ఆలయ ట్రస్టీ, ఫౌండర్ రామాజీరావు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం ఆలయ పరిసరాలను జడ్జి పరిశీలించారు. కోనేరు, ఆలయ ఆవరణ, చెరువు పరిశీలించారు. మాజీ సర్పంచ్‌లు శివరాజ్, శ్రీశైలంయాదవ్, భాస్కర్ పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న 108 సిబ్బంది

సదాశివపేట, జూలై 29: సదాశివపేట 108 సిబ్బంది నిజాయితీని చాటుకున్నారు. సోమవారం మండల పరిధిలోని పెద్దాపూర్ శివారులో భిక్షాటన చేసుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తిని ఆటో ఢీకొనగా ఆ వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108లో సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. భిక్షాటన చేస్తున్న వ్యక్తి వద్ద రూ.13,633 ఉండగా, గమనించిన అంబులెన్స్ సిబ్బంది ఆ డబ్బును డాక్టర్లకు అందజేసి నిజాయితీని చాటుకున్నారు. పైలెట్ శ్రీనివాస్, ఈఎంటీ రఘులను పలువురు ప్రశంసిస్తున్నారు.

వైద్యులకు రూ. 13,633 నగదును అందజేస్తున్న 108 సిబ్బంది

ఆలయ నిర్మాణానికి విరాళం

గుమ్మడిదల, జూలై 29: మండంలోని కానుకుంటలో నూతనంగా నిర్మించే పోచమ్మతల్లి ఆలయానికి సీజీఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు రూ.1,11,116 విరాళం అందజేశారు. సోమవారం గుమ్మడిదల మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, సీజీఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి కానుకుంటలో నిర్మించే పోచమ్మ మందిర నిర్మాణానికి చెక్కు అందజేశారు. ఆలయకమిటీ చైర్మన్ శంకర్, గుండగళ్ల వెంకటేశ్, సుధాకర్, వీరేశ్, శంకర్ ఉన్నారు.

సమస్యలు తెలుసుకునేందుకే బస్తీబాట

జహీరాబాద్ పట్టణంలో సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

కోహీర్, జూలై 29: జహీరాబాద్ పట్టణ ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు సీపీఎం నాయకులు బస్తీబాట నిర్వహించారు. సోమవారం పట్టణంలోని రెహమత్ నగర్ కాలనీతోపాటు డబుల్ బెడ్రూం కాలనీలో పర్యటించారు. అపరిశుభ్రంగా ఇండ్ల పరిసరాలు, అధ్వానంగా రోడ్లు, తాగునీటి సరఫరాలో ఇబ్బందులు, చెత్తతో నిండుకున్న మురుగు కాల్వలు, అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణ కూడా సక్రమంగా లేదని స్థానికులు సీపీఎం నాయకులకు తెలిపారు. బస్తీబాటలో భాగంగా ప్రజల నుంచి తెలుసుకున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని సీపీఎం ఏరియా కమిటీ సభ్యుడు మహిపాల్ తెలిపారు. కార్యకర్తలు ఉన్నారు.

నేడు డయల్ యువర్ లాజిస్టిక్ ఏటీఎం

సంగారెడ్డి, జూలై 29: ఆర్టీసీ ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడంతోపాటు వ్యాపారం చేస్తే వారి వస్తువులను సురక్షితంగా చేరవేస్తూ సేవలు మరింత దగ్గర చేసిందని లాజిస్టిక్ ఏటీఎం ఆసాక్ బీన్ మహమ్మద్ సోమవారం ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు మెదక్ రీజియన్ లాజిస్టిక్ ఏటీఎంతో డయల్ యువర్ కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు. ప్రయాణికులు, వ్యాపారులు కార్గో సేవలపై అభిప్రాయాలు, సలహాలు, సూచనలను ఈ 812546978 నంబర్‌కు ఫోన్ చేయాలని తెలపాలని కోరారు.

రిజర్వేషన్లు సాధిస్తాం

హత్నూర, జూలై 29: ఎమ్మార్పీస్ 30వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం హత్నూర, నవాబుపేట గ్రామాల్లో జెండా విష్కరించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బుచ్చేంద్రమాదిగ మాట్లాడుతూ మాదిగ రిజర్వేషన్ సాధించే వరకు పోరాటం ఆగదన్నారు. నాయకులు గందగల్ల వీరయ్య, ముత్తరగల్ల రాజు, దేవులపల్లి మహేశ్, దుర్గదాసు, మొగులయ్య, ఎల్లయ్య, గంగయ్య, అంజయ్య పాల్గొన్నారు.

బోనాలకు సాఫీగా..

జిన్నారం, జూలై 29: ఊట్ల పంచాయతీ దాదిగూడలో పోచమ్మ ఆలయానికి బోనాలతో వెళ్లాలంటే మహిళలు ఇబ్బందులు పడతారని గ్రామస్తులు ఎంపీపీ రవీందర్ గౌడ్‌కు సమస్యను వివరించారు. స్పందించిన ఆయన రోడ్డుపై నుంచి నీళ్లు వెళ్లే చోట పైపు వేయించి రాకపోకలకు మార్గాన్ని సుగమం చేశారు. సోమవారం మహిళలు బోనాలతో ఇదే దారిన వెళ్లారు.

ఊరూవాడా బోనాల సంబురం

పల్లెలు, పట్టణాల్లో బోనాల సంబురాలు అంబరాన్నంటుతున్నాయి. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని భక్తులు అమ్మవార్లకు బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఆదివారం బోనాల ఉత్సవాలు అంబరాన్నంటగా సోమవారం సైతం భక్తులు బోనం సమర్పించారు. డప్పుచప్పుళ్ల మధ్య మహిళలు నెత్తిన బోనాలతో వెళ్లి నైవేద్యం సమర్పించి పిల్లాజల్లా, పాడిపంటలు బాగుండాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా యువకుల నృత్యాలు, పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. పలు చోట్ల దేవతామూర్తుల వేషధారణలతో అలరించారు.

- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, జూలై 29

అందోల్: జోగిపేట బృందవన్ కాలనీలో అమ్మవారికి బోనం సమర్పించేందుకు వెళ్తున మహిళా భక్తులు

వట్‌పల్లి: గొర్రెకల్‌లో ప్రజలతో కలిసి బోనం ఎత్తుకున్న మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్



అమీన్‌పూర్: పోచమ్మకు వెండి చీరను అందజేస్తున్న నందారం కుటుంబ సభ్యులు, తదితరులు

పటాన్‌చెరు: బోనాల వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

బొల్లారం జూలై 29: బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని గాంధీనగర్‌లో నివసించే రాందాస్ అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న సోనుసూద్ చారిటీ సభ్యుడు ప్రవీణ్ రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి అంత్యక్రియల నిమిత్తం రూ.5వేలు ఆర్థికసాయాన్ని అందించారు. అలాగే మృతుడి కుమార్తె అనారోగ్యానికి గురైనట్లుగా తెలుసుకొని వైద్య ఖర్చుల నిమిత్తం మరో రూ.5 వేలు అందించారు. కౌన్సిలర్ చంద్రయ్య, పాస్టర్ శంకర్, నాయకులు చక్రపాణి, నరసింహ, కుమార్, సత్య, స్థానికులు, చారిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా అలీ అబ్బాస్ జాతర

గుమ్మడిదల, జూలై 29: అలీఅబ్బాస్ జాతరను గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. సోమవారం మంభాపూర్‌లో భీపాత్మ సహిత అలీ అబ్బాస్ సవారీ జాతరను పురస్కరించుకొని గ్రామస్తులు అలీఅబ్బాస్ సవారికి దట్టీలు, పూలదండలు, ఊదుబెల్లంతో మొక్కులు చెల్లించుకున్నారు. సవారి ఎదుట ఆటపాటలతో సంతోషంగా గడిపారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి దర్శించుకున్నారు. నిర్వాహకులు నందగిరి కిషన్‌రావు, నందగిరి ప్రభాకర్‌రావు, వెంకట్రావు, రాఘవేంద్రరావు, మాజీ సర్పంచ్ కంజర్ల శ్రీనివాస్, మాజీఉపసర్పంచ్ దయానంద్, నాయకులు పాల్గొన్నారు.

అల్లుకున్న నిర్లక్ష్యం.. పొంచి ఉన్న ప్రమాదం

ముంగి–న్యాల్‌కల్ రోడ్డు పక్కన విద్యుత్ స్తంభాలకు అల్లుకున్న తీగ మొక్కలు

న్యాల్‌కల్, జూలై 29: మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలకు, వైర్లకు మొక్కల తీగలు అల్లుకొని ప్రమాదాన్ని సూచిస్తున్నాయి. స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు పచ్చని తీగలు ఎగబకి స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు కనిపించనంతంగా అల్లుకున్నాయి. వర్షం కురిసే సమయంలోనూ, ఈదురు గాలులు వీచే సమయంలో ఇవి ప్రమాద తీవ్రతను పెంచుతాయి. అయినప్పటికీ విద్యుత్ శాఖాధికారులు, సిబ్బంది మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యం వీడి ప్రమాదాలు జరగకుండా అల్లుకున్న తీగలను తొలిగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.